రోడ్డు విస్తరణలో జాప్యం

- రూ. 30కోట్లు మంజూరైనా మొదలు కాని పనులు
- డ్రెయినేజీ దాటిన నిర్మాణాలు తొలగింపు
- ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు
- తీరని ట్రాఫిక్ కష్టాలు



గంభీరావుపేటలో ప్రధాన రహదారి

గంభీరావుపేట: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోంది. మేజర్ గ్రామపంచాయతీ పట్టణంలో 80 ఫీట్ల మేర రోడ్డు విస్తరణకు తీర్మానం చేసింది. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన వారి నిర్మాణాలతో పాటు రోడ్డుకిరువైపులా డ్రెయినేజీ దాటి కట్టిన నిర్మాణాలను తొలగించారు. దీంతో వ్యాపార దుకాణాల యజమానులు దుకాణాల్లోకి రావడానికి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్నాళ్లు రోడ్డు విస్తరణకు పలువురు అడ్డంకి చెప్పడం, నిధులు లేకపోవడంతో పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం ప్రభుత్వం రోడ్డు విస్తరణకు రూ.30 కోట్లు మంజూరు చేయడంతో త్వరలోనే పనులు చేపడుతారని ఆశించారు, కాని నెలల గడిచినా పనులు ప్రారంభం కాకపోవడంతో రోడ్డు విస్తరణపై సందిగ్ధం నెలకొంది. ఎన్నికలు సమీపిస్తున్నందున రోడ్డు విస్తరణ పనులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నాలుగైదు నెలల్లో పనులు చేపట్టి పూర్తి చేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అయోమయంలో వ్యాపారులు

రోడ్డు విస్తరణ వ్యవహారంతో వ్యాపారులు అయోమయంలో పడ్డారు. ఏళ్లగా దుకాణాలు నిర్వహిస్తున్న తమకు జీవనోపాధి కరువవుతుందని ఆందోళన చెందుతున్నారు. కొంతమంది పూర్తిస్థాయిలో ఇళ్లను కోల్పోవాల్సి వస్తోంది. మరికొంతమందికి సంబంధించిన నిర్మాణాలు పాక్షికంగా తొలగించాల్సి వస్తోంది. పనులు పూర్తయ్యే వరకు తాము ఏం చేయాలి, సామగ్రి ఎక్కడ పెట్టుకోవాలి, తమకు ఆధారం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

80 ఫీట్ల మేర విస్తరణ

మండల కేంద్రంలో ప్రధాన రహదారిని 80 ఫీట్లు విస్తరించాలని గ్రామపంచాయతీ తీర్మానం చేసింది. మొదట 100 ఫీట్లు అనుకున్న బాధితుల విజ్ఞప్తుల మేరకు తగ్గించారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు పూర్తిగా కోల్పోయే వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామని, కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారికి పంచాయతీగా ఫ్రీగా అనుమతులు ఇస్తుందని, కూల్చివేతకు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే గ్రామపంచాయతీ సొంత ఖర్చులతో కూల్చివేత పనులు చేస్తుందని నిర్ణయించారు. దీనికి సమ్మతించి కొంతమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కూల్చివేసుకున్నారు.

ట్రా'ఫికర్'

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు అధికమవుతోంది. జనం రద్దీ, వాహనాల సంఖ్య పెరిగిపోవడంతో రోడ్డుపై వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎలాంటి పార్కింగ్ సదుపాయాలు లేక వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. మండల కేంద్రం కావడంతో వివిధ పనుల నిమిత్తం మండల ప్రజలు నిత్యం ఇక్కడికి వస్తుంటారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. విస్తరణ పనులు పూర్తయి ట్రాఫిక్ సమస్య ఎప్పుడు తీరుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

త్వరగా చేపట్టాలి



ఏళ్ల తరబడి కోరుతునే ఉన్నాం. అడపదడపా కూల్చివేత పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా పనులు వేగవంతం చేయాలి. విస్తరణకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. మంత్రి కేటీఆర్ చొరవ తీసుకొని పనులు ప్రారంభమయ్యేలా చూడాలి.

– రాగిశెట్టి నారాయణ, మాజీ సర్పంచ్

నష్టపరిహారం చెల్లించాలి



రోడ్డు విస్తరణలో ఇళ్లు నష్టపోయే వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. రోడ్డు విస్తరణతో మాకు తీవ్రంగా అన్యాయం జరుగుతుంది. మంత్రి కేటీఆర్ స్పందించి న్యాయం చేయాలి. అలాగే గంభీరావుపేటకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

– గంట అశోక్, వ్యాపారి, గంభీరావుపేట

క్లుప్తంగా

ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

- ఆర్డీవో ఆనంద్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

ముస్తాబాద్: ఓటరు నమోదు కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ అన్నారు. ముస్తాబాద్ రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. బీఎల్‌వోలు బూత్‌లలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఫారం–6 ద్వారా నూతన ఓటరు నమోదు, ఫారం–8 ద్వారా ఓటరు జాబితాలో సవరణ చేసుకోవచ్చన్నారు. శని, ఆదివారాల్లో సైతం పోలింగ్ బూత్‌లలో ప్రజలకు అందుబాటులో ఉండి, ఓటరు నమోదును విజయవంతం చేయాలన్నారు. ఓటు విలువను ప్రజలకు తెలియజేప్పే బాధ్యత బీఎల్‌వోలదేనన్నారు. తహసీల్దార్ గణేశ్, డీటీ సురేశ్, ఆర్‌ఐ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


మాట్లాడుతున్న వికాస్‌రావు

చందుర్తి: మండలంలోని ఎన్గల్ గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్‌ను చెన్నమనేని దీప వికాస్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వికాస్‌రావు మాట్లాడుతూ కలుషితమైన నీటిని సేవించడంతోనే చాలా జబ్బులకు గురవుతున్నారని, స్వచ్ఛమైన నీటితో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగంపల్లి సత్తయ్య, ఎంపీటీసీ కవిత, ఉప సర్పంచ్ మంజుల, ఆలయ చైర్మన్ కమలాకర్, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, మోకిలే విజేందర్, బీజేపీ నాయకులు మార్త సత్తయ్య, సిరికొండ శ్రీనివాస్, పొంచేటి రాకేశ్, సిర్రం తిరుపతి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై శేఖర్‌రెడ్డి

ముస్తాబాద్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ జరుగుతుందని ఎస్సై శేఖర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో పలు వాణిజ్య సంస్థలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరాల వందమంది పోలీసులతో సమానమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను అరికట్టవచ్చన్నారు. ముఖ్యంగా చోరీలు, మూకదాడులను నివారించవచ్చన్నారు. ప్రతి వ్యక్తి తమ ఇంటిలో, వ్యాపార సంస్థలలో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనేక నేరాలలో సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దొంగలను, నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. పోలీస్ సాయం కోసం 100 డయల్ చేయాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, పీసీలు పాల్గొన్నారు.

సమాచారం

కేజీబీవీలో కుక్ పోస్టులు

వీర్నపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు అవుట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో రఘుపతి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 28 లోగా మండల వనరుల కేంద్రం ఎల్లారెడ్డిపేటలో అందచేయాలన్నారు.

నియామకం

కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడిగా శ్రీధర్

వేములవాడ: వేములవాడ పట్టణ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా నేరెళ్ల శ్రీధర్‌ను నియమించినట్లు పట్టణశాఖ అధ్యక్షులు సాగారం వెంకటస్వామి శుక్రవారం తెలిపారు. అలాగే బీసీ సెల్ వైస్‌ప్రెసిడెంట్‌గా మండే రాజు, ప్రచార కార్యదర్శిగా పబ్బ శ్రీనాథ్‌గౌడ్, బీసీ సెల్ కార్యదర్శిగా శ్రీకాంత్‌ని నియమించారు. కార్యక్రమంలో బీసీ అధ్యక్షుడు నాగుల రాముగౌడ్, నాయకులు చిలుక రమేశ్, కనికరపు రాకేశ్, కూరగాయల కొమురయ్య, నాగుల విష్ణు, వెంకన్న, దాడి మల్లేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా నర్సింలు

ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం మండల అధ్యక్షుడిగా పోతుగల్‌కు చెందిన తలారి నర్సింలును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు ఉత్తర్వులు జారీ చేశాడు. పోతుగల్ ఎంపీటీసీగా, సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా పనిచేస్తున్న నర్సింలు పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తారన్నారు.

బీఎస్పీ మండల కమిటీ

గంభీరావుపేట: మండల బహుజన సమాజ్ పార్టీ నూతన కమిటీ శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా కర్రొల్ల రాజు, ఉపాధ్యక్షులుగా బరుకుటం తిరుపతి, కరికె సతీశ్, ప్రధాన కార్యదర్శిగా నాగార్జున, కార్యదర్శిగా రాజశేఖర్, పట్టణశాఖ అధ్యక్షుడిగా ఎర్రొల్ల బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా నిరంజన్ ఎన్నియ్యారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గం

సిరిసిల్లటౌన్: భవన నిర్మాణ కార్మిక సంఘం సిరిసిల్ల పట్టణ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొడిముంజ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి పసుల బాలరాజు, సలహాదారులు అక్కెనపల్లి మల్లేశం, మారుపాక దుర్గయ్య, కన్నం శంకర్, బూర నర్సయ్య, పోకల దేవయ్య, మల్యాల రాజయ్య, బల్ల నాగరాజు, కోశాధికారి ఏదునూరి ప్రశాంత్‌తో పాటు కార్యవర్గసభ్యులు వెంగల శ్రీనివాస్, ముస్తాఫా, వికాస్. నవీన్, శ్రీనివాస్, రాజు, లచ్చవ్వ, పుష్ప, హనుమవ్వ, పద్మలను ఎన్నికైనట్లు జిల్లా సంఘం అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్ ప్రకటించారు.

రావమ్మా వరలక్ష్మీ


సిరిసిల్ల బీవైనగర్ గోల్డెన్ టెంపుల్‌లో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు


ఎల్లారెడ్డిపేట సాయిబాబా ఆలయంలో సామూహిక వ్రతం ఆచరిస్తున్న మహిళలు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి: పవిత్ర శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు తమతమ ఇళ్లల్లోనే వరలక్ష్మీ వ్రతాలు జరుపుకున్నారు. ఇరుగు పొరుగు మహిళలకు వాయినాలు ఇచ్చి ఆశీర్వచనాలు అందుకున్నారు. సిరిసిల్ల హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో బీవైనగర్‌లోని గోల్డెన్ టెంపుల్ (పోచమ్మ దేవాలయం), శ్రీ విశ్వనాథస్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. నెహ్రూనగర్ అంబాభవాని ఆలయం, స్థానిక విద్యానగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట సాయిబాబా, దుర్గామాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శెనగలు, వడపప్పు, పరమాన్నం, బూరెలు తదితర పిండివంటలతో నైవేద్యాలు నివేదించారు.

అర్హులకు డబుల్ ఇళ్లు ఇవ్వని చేతగాని ప్రభుత్వం

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్: గడిచిన తొమ్మిదేళ్లలో అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వని చేతగాని ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి దుయ్యబట్టారు. మండలంలోని గోపాల్‌పల్లె, రాంరెడ్డిపల్లె గ్రామాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి శుక్రవారం కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కనీసం అటెండర్ ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. డబుల్ ఇళ్లు నిర్మిస్తామని చేతులు ఎత్తిన సీఎం కేసీఆర్‌కు రాబోవు ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్తారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి, నిరుద్యోగులకు జీవన భృతి ఇస్తుందన్నారు. ఇంటి స్థలం వున్న వారికి రూ.5 లక్షలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు కొండం రాజిరెడ్డి, మిర్యాల్‌కార్ శ్రీనివాస్, గజ్జెల రాజు, జంగం సుమలత, బషీర్, నర్సింలు, రామచంద్రం, బాపురెడ్డి, భాను, రమేశ్, రాజిరెడ్డి, రాంరెడ్డి, కొండల్‌రెడ్డి, రాజేశం, నారాయణరెడ్డి, నరేశ్, సాయి, మారుతి పాల్గొన్నారు.

ఆసరా పేరిట దోపిడీ

- మారుపాక కేంద్రంగా దందా
- మోసపోయిన సిరిసిల్ల వాసులు

సిరిసిల్లక్రైం: ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్ ఇప్పిస్తానని నమ్మబలికి లక్షలు వసూలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఓ మహిళకు నాలుగు నెలల క్రితం ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే ప్రయత్నాలు చేస్తుంది. ఈ క్రమంలో వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని ఓ గ్రామానికి చెందిన లింగయ్యగౌడ్ మాటలు కలిపి, పెన్షన్ వచ్చేలా చేస్తానని నమ్మబలికాడు. మహిళ నుంచి దపదఫాలుగా ఏకంగా రూ.40 వేలు వసూలు చేశాడు. అంతేకాదు సంబంధిత మహిళకు సంబంధించిన బ్యాంకు ఖాతా తీసుకుని ప్రతీ నెల రూ.2 వేలు ఆ ఖాతాలో జమచేశాడు. దీంతో మహిళ నిజంగానే ఆసరా పెన్షన్ వస్తుందని నమ్మింది. లింగయ్య ఓ రోజు కలువగా సంతోషాన్ని వ్యక్తం చేయగానే ఇక్కడే మరింత మంది మోసం చేయడానికి ప్రబుద్ధుడు ప్లాన్ చేశాడు. మహిళకు తెలిసిన వారికి విషయాన్ని తెలపాలని చెప్పి మరో ఐదుగురి వద్ద తలా రూ.15 వేలు తీసుకున్నాడు. నెలలు గడిచిన బ్యాంకు సొమ్ము జమకాకపోవడంతో అసలు ముందుగా డబ్బులు చెల్లించిన మహిళకు ఆసరా పెన్షన్‌వస్తుందా అనే క్రమంలో ఆన్‌లైన్‌లో తమకు తెలిసిన వారితో ఆధార్ ఆధారంగా తనిఖీ చేయించగా.. పెన్షన్ రావడం లేదని తెలుసుకున్నారు. దీంతో బాధిత మహిళలు మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

సర్కారు తాత్సారం



సిరిసిల్లటౌన్: తమ డిమాండ్లను నెరవేర్చడంలో రాష్ట్ర సర్కారు తాత్సారం చేస్తుందని మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు దేవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మాజీ సర్పంచుల దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. న్యాయం జరిగే వరకు తాము చేపట్టిన పోరాటాన్ని విరమించబోమని హెచ్చరించారు. దీక్షల్లో బుర్ర మల్లేశ్‌గౌడ్, గుమ్మడి కాంతయ్య, అలువాల లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, గౌరయ్య, లక్ష్మయ్య, పర్శయ్య పాల్గొన్నారు.

కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

ముస్తాబాద్: బీఆర్‌ఎస్ కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేసి మంత్రి కేటీఆర్‌కు గతంలో కంటే భారీ మెజార్టీని తీసుకువచ్చేలా పనిచేయాలని జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి కేటీఆర్‌కు సిరిసిల్ల టికెట్ కేటాయించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఎంపీటీసీ మంజుల, ఏఎంసీ మాజీ చైర్మన్ జానబాయి, మాజీ ఉపసర్పంచ్ శ్రీను పాల్గొన్నారు.

సెస్ చైర్మన్‌కు సన్మానం


చిక్కాలను సన్మానిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ వేణు

ఇల్లంతకుంట: సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఇల్లంతకుంటలోని జెడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు క్యాంపు కార్యాలయానికి తొలిసారి రాగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్య, పట్నం అశ్విని, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

వేములవాడరూరల్: మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. మండలంలోని నూకలమర్రి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మీ కోసం పోలీస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో భూతగాదాలు, వ్యక్తిగత గొడవలు చేసుకోవద్దన్నారు. కోర్టు పరిధిలో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మారుతి, సర్పంచ్ పెండ్యాల తిరుపతి, ఎంపీటీసీ బొడ్డు శంకరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ శివారులోని దర్గా ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన అందె రాజు, భార్య దేవలక్ష్మి, కుమారుడు, కూతురుతో కలిసి బైక్‌పై కామారెడ్డి నుంచి గొల్లపల్లికి వస్తున్నారు. బొప్పాపూర్ శివారులోని దర్గా వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాజు పరిస్థితి విషమంగా ఉంది. భార్య, ఇద్దరు పిల్లలకు స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాత్రివేళ కావడంతో తరలించేందుకు సుమారు రెండు గంటల సమయం పట్టింది.

ఓపెన్ డ్రింకింగ్‌పై ఐదు కేసులు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ పరిసర ప్రాంతాల్లో బహిరంగ మద్యపానం చేస్తున్న వారిపై ఐదు కేసులు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. ఓపెన్ డ్రింకింగ్‌ను నియంత్రించేందుకు రోజువారీగా బ్లూకోట్, పెట్రోలింగ్‌తో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మూడు సెల్‌ఫోన్స్ అప్పగింత

సిరిసిల్లక్రైం: సిరిసిల్లటౌన్ పోలీసు స్టేషన్‌పరిధిలో సెల్‌ఫోన్ పోయినట్లు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదుతో దర్యాప్తు చేసిన పోలీసులు ముగ్గురి సెల్‌ఫోన్లను కనుగొని వారికి అప్పగించారు. సత్తయ్య, కార్తిక్, అజయ్ అనే ముగ్గురు వారి సెల్‌ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు సీఈఐఆర్ లో వివరాలను పొందుపరుస్తూ ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త వార్తలు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

రుద్రంగి: అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండిన వయోజనులు ఓటరుగా నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య ఒక్క ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27లలో మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలైన జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటరు లిస్టులో సవరణలు చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. ఓటరు నమోదుకు ఫారం–6, ఓటరు లిస్టులో సవరణలకు ఫారం–8 నింపి బీఎల్‌వోలకు ఇవ్వాలని సూచించారు.

అన్నదానం

వేములవాడ: ఆకలితో అలమటిస్తున్న పేదలకు మైవేములవాడ ట్రస్టు ప్రతినిధులు శుక్రవారం 150 మందికి అన్నదానం నిర్వహించారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దేవునిగుట్టతండా, బాకూర్‌పల్లితండాలలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సర్పంచులు పెంటయ్య, ఆజ్మీరా మంజుల శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రకాశ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎల్లారెడ్డిపేట: గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని, గ్రామంలో తలారి పనులు మాల సంఘం వారే చూసుకోవాలని గ్రామసభలో తీర్మానించారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఇటీవల గ్రామంలో నలుగురు చనిపోతే తలారి పనులు చేసేవారు నిరాకరించడంతో అన్ని కులాల పెద్దలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మాల సంఘం వారు ఎవరో ఒకరిని తలారి పనులకు నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో వార్డు సభ్యులు, వివిధ కుల సంఘాల పెద్దమనుషులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



తంగళ్లపల్లి: మండలంలోని నర్సింహులపల్లె మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మంద నర్సయ్య (65) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. నర్సయ్య నర్సింహులపల్లె గ్రామానికి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా సేవలు అందించారు. నర్సయ్య మృతదేహానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పూలమాలవేసి నివాళి అర్పించారు. నర్సయ్యకు ఇద్దరు కూతుళ్లు, పెద్ద కూతురు వివాహం కాగా, చిన్న కూతురు ఇంజినీరింగ్ చదువుతోంది.

బీమా చెక్కులు అందజేత

ముస్తాబాద్: మండలంలో ప్రమాదవశాత్తు మృతిచెందిన ముగ్గురు బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు మండల శాఖ అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు రూ.2 లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులు శుక్రవారం అందించారు. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందిన బందనకల్‌కు చెందిన కొమ్మెట ఎల్లయ్య, ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన ముస్తాబాద్‌కు చెందిన కంచం నవీన్, బైక్ ఆక్సిడెంట్‌లో ప్రాణాలు కోల్పోయిన మద్దికుంటకు చెందిన సూత్రపు దేవయ్య బీఆర్‌ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో వీరికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో ప్రమాద బీమా చేయించినట్లు తెలిపారు.

సూరమ్మ వనభోజనాలు

రుద్రంగి: మండల కేంద్రంలో కుల సంఘాల ఆధ్వర్యంలో సూరమ్మ వన భోజనాల పండగ నిర్వహించారు. సూరమ్మకు బోనం వండి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.